## ఎ"లక్షణము"లు

**ఎన్నికలు**
ఎన్నో కళలు
అందరికి 'కల"లు!

**ఓటు**
మనిషికో రేటు
దేశానికి ఆర్థిక "పోటు"!

**ఓటరు**
అన్ని పార్టీల ప్రతి"నిధి"
నే"తల" రాతలు రాసే "విధి"!

**గుర్తింపు కార్డు**
నిరక్షరాస్యునికైనా
అక్షర సాక్ష్యం!

**మ్యానిఫేస్టో**
అంతులేని చిట్టా
ఓటరుకు అందని కనీస "దాక్ష"!

**జెండా**
మనసుల్ని వేరు చేసే రంగులు
ఒకటై ఖద్దరు తెలిపే "హంగు"లు!

**ప్రచారం**
కొత్త బిచ్చ "గాండ్లు"
పొద్దెరగరు!

**ప్రచార బృందం**
ఎన్నికల దరికి చేరేవన్నీ
రాజకీయ నత్తలే!

**గుర్తు**
"కత్తి" నుండి "తుపాకీ" వరకు గుర్తులు
ఎన్నికల పిదప మిగిలే తీపి "గుర్తులు"!

**కార్యకర్త**
"కట్టలు" తెంచుకొన్న ఆవేశం
ఎన్నికల పిదప మిగిలే తీపి "గుర్తులు"!

**సర్వే**
పత్రికకో పార్టీ
తమ మానస పుత్రికకే మెజార్టీ!

**చర్చ**
నలుగురి కలయిక రాజ"కీ"యం!
తన భావమే నిజమని మనోనిర్ణయం!

**ఎలక్షన్ కమీషన్**
బిందెల కొట్లాటలోబయపడ్డ రంకు
కొండను తవ్వి బయటకు తీసే పెంకు!

**పోలింగ్ "బూత్"**
నాలుగు గోడల్లో
గర్భంలో ఎదుగుతున్న ఖద్దరు భూతం!

**ఎలక్ట్రోరల్ రోల్**
బ్రతికున్న నిదర్శనం
పేరు క్రింద మీద అయితే ప్రదక్షణం!

**ఇండెలియబుల్ ఇంక్**
ప్రజాస్వామ్యంపై చెరగని
"మచ్చ"!

**పోలింగ్ బాక్స్**
కొవ్వు పేరిన నాయకుని బొర్ర
గెలిస్తే బలుపు, ఓడితే వాపు!

**ఇ.వి.యం.**
తాటిపండు పడిన మూలిగే నక్క
ఫలితాలు వెళ్ళడయితే తీసిపడేసే అరటి తొక్క!

**పార్టీ ఫిరాయింపు**
వంపులో వదిన. మిట్టయితే మరదలు
రెండో భార్య మంచిది, మొదటి "ఛీ"!

**ఫలితాలు**
గెలిచినోడు మనో"డు"
ఓడితే ఎవడాడు?



-డా॥ విప్లవ్‌దత్ శుక్లా



## దేశం

**తల**
**అవతల పెడదామంటే**
**ఒకటే యుద్ధాల గోల.**

**పోనీ**
**లోపలికని ముడుచుకుందామంటే**
**రోత రాజకీయాల రొద.**

**కాసేపు**
**నిలబడన్నా ఉందామంటే**
**ఠక్కున నెత్తికి తాకి-**
**బొప్పి కట్టించే**
**నిత్యావసర వస్తువు ధర**

- అలిశెట్టి ప్రభాకర్

## జర భద్రం

భూమి చలిదుప్పటి కప్పుకుంది.
ఎన్ని"కల" గాలి వేడిగా వీస్తూ...
వెచ్చగా నిద్రపుచ్చుతుంది.
హామీల మేఘాలు నింగిని కమ్ముకొని
రవికిరణాలను అడ్డుకుంటున్నాయి.
నాయకుల మాటలతో..
వాగ్దానాల వర్షం కురుస్తుంది.
చలికి వనుకుతూ...
చీకటి హామీల జాతరలో చిక్కుకొని
వెలుగుదొరకని "ఓటరూ"...

జర భద్రం.
జెండాను మోస్తూ
నీ భుజాలు అరిగిపోతున్నాయి.
జెండాను చూడకు...దాని వెనుక దాగిన
మర్మాన్ని చూడు.

జెండాలు అజెండాలు ఒక్కటే నాయకులకు.
దాచుకోవడం దోచుకోవడం.
దయగల హృదయుడవై దాసోహమయ్యావో
దగాపడుతావు "ఓటరు" జర భద్రం.





-అశోక్ గోనె
9441317361

## ఓటరు భాష్యం.

నగారా మోగిందా
నయాగరా దుమికిందా
సందుల్లో, గొందుల్లో ఏమది?
అదే,
ప్రచార పాటల హోరు!
నేతల జీవన ఘోష!

ఎంత ప్రచారం చేసినా
నేతలకి తీరిక దక్కదు.
ఓటరు ఆంతర్యం చిక్కదు!

మెర్క్యూరీ నవ్వుల నేతలు!
పాదరసం నడకల కార్యకర్తలు!

ప్రచార పథంలో,
కొందరికి రెండు కాళ్లు
మరికొందరికి మూడు కాళ్లు
ఉన్నవాళ్లకి నాలుగుకాళ్లు!

అన్ని పక్కలా
సారించాలి మన చూపులు !
పొంచి ఉన్నాయి
ఓటుకు గాలం వేసే వలలు!



ఇది ఎన్నికల
వెరైటీ మేనిఫెస్టోల
ప్రచారాస్త్రం!

ప్రజాస్వామ్య పీఠం పై
ఓటరే మహారాజు!
ఓటు తిరుగులేని బ్రహ్మాస్త్రం!!
(అలిశెట్టి ప్రభాకర్ నగర గీతం
త ప్రేరణతో...)

-కమలేకర్ శ్యాం ప్రసాద్ రావు
9441076632

## ప్రజా వజ్రాయుధం



పరికించు ఓ మారు
ఆలోచించు పలుమార్లు
వజ్రాయుధమైన హక్కును
కలిగినందుకు తనివితీరా
ఆనందించు ఆస్వాదించు
అలసత్వంతో ఆ హక్కును
అసహ్యంగా అంతమొందించకు
అవినీతిపరులకు
అందలమెక్కించకు
విలువైన ప్రజాయుధం
ప్రజాస్వామ్య రథచక్రం
ప్రజల రక్షణ అస్త్రం
చరిత గతిని మార్చేది
భవితకు భద్రత
భరోసా కలిగించేది
అక్రమార్కుల పని పట్టేది
సమాజ హితానికి
హేతువయ్యేది ఓటు
వట్టి మాటలు వినకు
భవిత అంగారం చేయకు
యువత నవశక్తులు
సరియైన పంథాలో
పయనం చేయాలంటే
ఆలోచించు నీ హక్కుకై
ఏరి కోరి ఏంచి
మెచ్చి పట్టం కట్టు
ఒకరిపై ఒకరు చేసుకొనే
వ్యంగ్యాస్త్రాలకు మట్టుపెట్టు
సమయం వృధా చేసే
పరస్పర దూషణ భాషణల
రాజకీయాలకు దూరంగా ఉండు
మంచిని కోరి మమతను పెంచి
కుల మత ప్రాంత భాషా
లింగ భేషజాలకు లొంగక
ఉన్న పవిత్ర పార్టీకి
వేయి నీ ఓటు
మాటల మాయల పకీరు
మాంత్రికులు వద్దు
చేతల చేవగల
తాంత్రికులు కావాలి నేడు
భారత అఖండ అభివృద్ధికి
శ్రీకారం చేసే కావాలి రేడు.
ఐదేళ్లకు ఓ మారొచ్చే
ఓట్ల పండుగ
వయోజన పోరుకు అండగ
పోలింగ్ రోజు ఉండగ
చూపించు నీ జోరు
ప్రజా హితం కోరు
ఓడిపో నీయకు నీ ఓటు
వినియోగించు బాధ్యతగా
బరిలో ఉన్న బడా నేతలందరూ
బడబాగ్నులే అయితే
తూటా లాంటి "నోటా"తో
తప్పక ప్రతిస్పందించు
నోటుకు ఓటు ఓటుకు నోటు
ఇకనైనా మాను
తాత్కాలిక మాటల
తాయిలాలకు లొంగక
శాశ్వత పరిష్కార మార్గాలకు
వేయాలి రాచ బాట
మద్యానికి మనీకి
బానిస కాకుండా
వేసేయి ఓటు తో వేటు
లేదు దానికి సరి ధీటు.



-సంధ్య సుత్రావె,
9177615967

## ఆత్మ సాక్షిగా ఓటెయ్యాలి

స్వార్థానికి పాటుపడే నేత మనకు చేటు
ప్రజల కోసం తపనపడే నాయకునికే ఓటు
వెలకట్ట లేనంత విలువ నీ ఓటు
అవినీతి నేతకు అది చేయాలి చేటు
ధన రాజకీయాన్ని దూరంగా పెట్టాలి
ఈరోజు నాది అని రుజువు చూపెట్టాలి
భారతావనుకున్న ఇంధనం యువతరం
ఉప్పొంగి చేయాలి ఎన్నికల సమరం
నమ్మించే నాయకుడికన్నా
నడిపించే నాయకుడే మిన్న
విలువైన శ్రమించే కష్టాన్ని నమ్ముకో
వెలకట్టలేని నీ ఓటును గెలిపించుకో
ఓటు అనే విల్లు ఎక్కుపెట్టి
గురు చూసి కొట్టాలి అవినీతిపై బాణం
ఎవరు ఏం చెప్పినా వింటూనే ఉండాలి
ఆత్మసాక్షిగా మాత్రమే ఓటు వేయాలి



-ఎం గంగోత్రి
తొమ్మిదవ తరగతి
జిఖఉూ హవేలీ ఘనపూర్, మెదక్ జిల్లా
9440021647

## ఓటు...ప్రగతికి చోటు



అమ్ముకునే వస్తువు కాదెప్పుడు ఓటు
నమ్మకంతో వమ్ము చేయకు నీకు చేటు
ప్రజాస్వామ్య రక్షణకు ఇది తొలిమెట్టు
దేశాభివృద్ధికి ఆయువు పట్టు
ప్రజల కొరకు పాలనయె జగతి
అవినీతి లేని సమాజమే కదా ప్రగతి నాయకున్ని
గెలిపించాలని వేసే ప్రతిఅడుగు
చెడుచేసే మోసాన్ని ఓటుతోని కడుగు
నీ వేలితో కొత్త సిద్ధాంతాన్ని రాసి చూడు
యోచనతో ఓటు వేసి గెలవాలి నేడు
ఒక్కరోజు మురిపానికి మార్చుకోకు నీ తీరు
ప్రలోబాలపర్వంలో దిగజార్చకు జోరు
ఐదేండ్లకు సుపరిపాలన కోరుకోమన్నా
ఐదువందల నోటుకు లొంగిపోకు అన్నా
ఉచితాలు కావు అవి నీవుకట్టె పన్నుకు ప్ర రూపాలు
నాయకుల ఇండ్లనుంచి ఇవ్వరెవరు తాయిలాలు
ఓటొక్కటేఆయుధము
సమరంలో గెలుచుటకై నీవే ఇక సాయుధము
వద్దనుకో ముళ్లు పరిచె నాయకున్ని
ఎన్నుకో మేలుచేసే ధీరున్ని
దన్నుకో భావి భద్రత పౌరున్ని



-డా.సముద్రాల శ్రీదేవి
9949837743

## సంకల్పబలం

సీ. బత్తెలక్కశిరీష బలమునాత్మదృఢమ్మె
ఒంటరియువతియే ఓట్లబరిని
నిల్చినిరుద్యోగ నిశ్చిత స్థితిని
యువతశక్తేకమై యుడక సాగె
మదిలోన భీతిచె మందలింపులుసాగె
బెదిరింపు దాడులు పెరిగి యప్ర
జాస్వామ్య మింకప్రజలకుమిగులునేమొ
ఎన్నికలనిలుచున్నెవరికైన
తే. రక్షణనునీయవలెయును రాత్రి పగలు
పార్టిలేవైన చేసేటి పనుల చెప్పు
భావ జాలము నిలబడ్డ వార్ని చెడ్డ
మాటలనుతూలుటింక మంచిదౌన.
సీ. ధనమద్యముచితపు తాయిలాలోట్లకై
పంచుచుందురుపలు పార్టిలన్ని
ఇండిపెండుటులింక నేమీయగలరయ్య
గెల్చిన పిదపనే గేములాట
బేరసారాలచె బేపారవస్తువై
అధికార పార్టికే అమ్ముడౌను
ఆపార్టి యీపార్టి యన్నిపార్టీలింక
పశుసంతలోకొన్న బలిపశువులె
తే.పదువులాశచే పార్టీల బదిలి జరుగు
ఈప్రజాస్వామ్య మింకను నెటులనిల్చు
జనులకాపాడుచుండేటి జనులనేత
లేలు కాలమెపుడుకనవలెనికమనము.



- సుదర్శనం వేణుశ్రీ
సెల్: 8328067855

## తమ్మీ..!

ఏ జెండా మోసినా
ఏ కండువా కప్పినా
మనదంతా ఒకటే ఊరాయే..
నువ్వు నేను గీన్నే ఉంటాం,
తెల్లారితే పొద్దువోతే
ఎదురు బదురయ్యేటివి
మన ఇద్దరి తలలే గుర్తువెట్టుకో..
మంచికాడ చెడుకాడ
మన నాల్గు చేతులు కలుస్తేనే
ఏ కార్యమైన ముందటవడేది
గీ సోయి తప్పుతున్నావ్..
ఏవేవో రంగుల కండువాలు
సింగారించుకొని రంగరించుకపోతున్నావ్
జరపైలం తమ్మీ..
ఓటు వేరే వాళ్ళ గెలుపుకో ఓటమికో కాదు
మన భవిష్యత్తు కోసమని
గమనించి వినియోగించుకో..!



-పోలీస్ భీమేశ్
9505255218

## ఓటు..

పల్లవి:
ఓహో... ఓహో...అన్నల్లారా!
ఓ హో... ఓహో...అక్కల్లారా!
మీ ఓటు జరభద్రం?
మిము గెలిపించే
వజ్రాయుధం!
మీ రాతను మార్చే
బ్రహ్మ అస్త్రం!
అది గుర్తెరిగి మీరంతా
మీకై శ్రమించే నాయకుల
గెలిపిస్తేనే ప్రజా రాజ్యం!!



చరణం:
ఓట్ల పండగ వచ్చిందని చుక్క ముక్కకు ఆశిస్తు
డబ్బుకు చేతులు చాసేసి ఓట్లు అమ్మితే మీరంతా
గెలిచిన వారు గద్దెక్కి మీ నెత్తిన సమ్మెట అవుతారు!
జలగల పట్టి మీరక్తం పీల్చి పీల్చి తాగేసు
సచ్చిన వాడు మీవంక కన్నెత్తి చూడడు
ఇది సత్యం?
మీ ఓటు వజ్రాయధం మీ రాతను మార్చే
బ్రహ్మ అస్త్రం
చరణం:
నక్కల నక్కి వస్తూనే పిల్లిల పసికడుతునే
ఇల్లు ఇల్లు తిరుగుతు ఎన్నో పనులు చేసేస్తు
ముడ్డికడిగి మురిపిస్తు ఫోటో పోజులు ఇస్తారు
ఒడిలోనే జోకొడుతూ కంచంలో భోంచేస్తు
మీలోఒకడిని నేనంటూ మీ ఓటే నా గెలుపంటు
ప్రమాణాలు చేయిస్తూ కాళ్ళు పట్టుకుంటారు
చరణం:
తాయిలాల వాసన పట్టి పథకాల నూకలు చల్లి
అరచేతిలో వైకుంఠం మాటల్లో తాంత్రికం
గారడి గారడి చేసి కళ్ళకు గంతలు కట్టేసి
తమ వెంట నడిచి వచ్చేలా గంగి రెద్దుల ఆడిస్తూ
ఓట్లు దండుకుంటారు మెల్లగ జారుకుంటారు
మీ ఓటు జరభద్రం
మిముగెలిపించే వజ్రాయుధం!



-ఆకుల రాఘవ,
సెల్:7382441792

## ఎన్నికల క్రీడ!

మృదు పదాల సరళి
మధురాక్షర శైలి
మందగమన సడి
మధురోహల వడి!

అక్షరాల సవ్వడి
ఆనందపు కేళీ
సరాగాల సందడి
స్వరకల్పనల విడిది!

శృంగార రసఝరి
రంగు రంగుల దీప్తి
కలకంఠి నాట్యాల
కమనీయ స్ఫూర్తి!

రసపుష్టి పరిపుష్టి
రమ్యతకు నాంది
రాజకీయ కేళి
రాక్షసత్వ పునాది!

ఆకలి కేకల
ఆనంద హేళీ
ఎన్నికలన క్రీడ
ఎవరడ్డుకునేరు?

ఉచితమనుచితమంటు
వాట్సాప్ గోలేల
వార్త ఛానల్లోన
వాదించరేల...?

దళారి వ్యవస్థ
వద్దనుటేలా...
పార్టీల గెలుపుకై
దళారు లేల...?

గెలుపే పరమావధిగ
పాలన లేలా...
ప్రజల సమస్యల
పట్టించుకోరా...!

బండ బూతు లేల
భాష ఖూనీలేల...
తెలగాణ భాషయన
అది తిట్టు భాషా....?

అనునయమ్మున
ఆషాడభూతిలా
జనుల మూర్ఖులం
జేయంగ జూతురా!

వద్దు వద్దిది
యింకెంత కాలము
మంచి పాలన నిచ్చు
మహరాజు రావాలి!

ఉచితాలు చాలించి
ఉపాధి జూపెడు
ప్రణాళికాత్మక
పాలన రావాలి....!

నీతి నిల్పెడు
నేటి నేత యెవడో వెదికి
ఓటేయ బోవాలి
పచ్చ నోటుకాశపడక యుండ!

మత్తు వీడు యింట
పడుకున్న మారాజ
నిద్ర వీడి కాస్త ఓటేయ రమ్మయా
తగిన వారెవ్వారు
లేరంటు ఉర్కొనకు
చివరాకరున నున్న
నోటాకు ఓటేయు!!



-యెనిశెట్టి గంగా
ప్రసాద్.
9866447234.

## బర్రెలక్క అలియాస్ శిరీష

బర్రెలక్క బరిలో నిలిచింది.
ఇన్నిరోజులు ఉద్యోగంలేక పోరాడింది.
రాజకీయ నిరుద్యోగుల ఎలక్షన్
నోటిఫికేషన్ లో...
ఐదు ఏండ్ల పదవికి ఒక సామాన్య మహిళ పోటీ.
కొల్లాపూర్ కొల్లగొడుతుందా...
డబ్బులు లేవు...
మంది మార్బలం లేదు...
బందుగణం లేదు...
బడా నాయకుల భరోసా లేదు...
మార్పు కోసం ఒక యువ మహిళ.
చరిత్ర రాసే తీర్పు కొల్లాపూర్ ప్రజల వద్దవుంది.
న్యాయం గెలవాలి.
మార్పు రావాలి.
యువత వెళగాలి.

-అశోక్ గోనె
9441317361.

## ఎన్నికల వేడి!

ఎన్నికల కోడి కూసింది
కొలువుల కొట్లాట షురూ అయింది
సిద్ధాంతాలు మూసీ నదిలో విసిరేసి
లెక్కలు బొక్కలు చూసుకుంటూ
పూటకో పార్టీ పంచన చేరుతుంటే
బుడుబుంగలు సిగ్గుపడుతున్నాయి.



గంజి బట్టలు , బెంజి బండ్లు
గడపగడపకు పచార్లు కొడుతూ
ఓటి పోయిన వాగ్దానాలను ఒడ్డున పడేసి
కొత్త రాగాలకు కైగట్టి పాడుతున్నాయి
ఉచితాల ఈటెలను ఒడుపుగా వదులుతూ
ఓట్ల వలను విశాలంగా పరుస్తున్నారు
పచ్చ నోట్ల కొండ చిలువలు అడ్డంగా
ఓటు విలువను మింగుతూనే ఉన్నాయి.

అధికారం కోసం అడ్డ దారులు తొక్కుతూ
కష్ట కాలంలో పార్టీని కంటికి రెప్పలా
కాపాడి న్నోళ్ళను కడలిలో కలిపేసి
జంప్ జిలానీలకు జై కొడుతూ
సీనియారిటికి శిలువనేస్తున్నారు.

పూట కోసం పురిటి నొప్పులు పడే గరీబోళ్ళు
పొయ్యిని వెలిగించడం కోసం
ఆత్మ వంచనకు అడ్డంగా ముసుగేసి ఉరితీసి
రోజుకో జెండాను భుజాలపై మోస్తూనే ఉన్నారు
తమ చీకటి బతుకుల్లోకి
ఎలాంటి వెలుగు రేఖలు
చుట్టపు చూపుగానైనా రాకపోయినా
తరాల నుండి పార్టీలకు ఊపిర్లు ఊదుతూనే ఉన్నారు .

ఎన్నికలంటే బడా బాబులకు కలెక్షన్ల గడ్డ
ఎండిన డొక్కలకు నెలరోజులు ఉపాధి అడ్డా.



-తాటిపాముల రమేశ్ (తార)
7981566031

## ఓటు

ఎన్ని సార్లు గెలిచిందో,
ఎన్నిసార్లు ఓడిందో
ఓటుకే తెలియాలి.
ఓటరు మహాశయుడికే
తెలిసుండాలి.



కమ్ముకున్న మబ్బు
నమ్ముకున్న ప్రతీసారి
కురువనట్టే ,
హామీల వర్షం
మనసు పొరలను
నిండా ముంచుతుంది
కానీ,ఒక్క వాగ్ధానం మొలకెత్తుతే ఒట్టు.
ఓట్ల తెల్లారి
హామీల చిరునామా గల్లంతై
తెగిన గాలిపటంలా
గింగిరాలు కొడుతూనే ఉంటుంది.
మళ్లీ ఐదేండ్లకు గానీ
భూమార్గం పట్టదేమో!

ఓటు
ఎప్పుడు ఓడి పోవద్దు అనుకుంటూనే,
ఎటువైపో
తేల్చుకోలేక
బేలతనం ప్రకటిస్తూనే ఉంటుంది.
లక్ష్యాల
మైలురాళ్ళు వేగంగా
వెనక్కి వెళ్తున్నయి
కాలాన్ని తోసుకుంటూ.
అయితేనేం,
ఉన్నచోటే అభివృద్ధి
కొయ్యగుర్రమై పరిగెడుతుంది.
అదే అభివృద్ధి అనుకుంటూ
ఎండమావుల జాడలను చూసి
సంబరాలు చేసుకుంటున్నాం.

ఎన్ని మాటలు
ఎన్ని వాగ్దానాలు
ఎన్ని వరాలు
ఎన్నో ఎన్నెన్నో
వజ్రోత్సవ సాక్షిగా.

మన స్వాతంత్ర్యం
మేడిపండు కాదని
నిరూపిద్దాం.
మన ప్రజాస్వామ్యం
నేటి మేటి మలుపని
ప్రకటిద్దాం.

ఓటు
నీ మనసంత
తెల్లనిది.
అమ్మంత గొప్పది.
దాన్ని అమ్మకు.
అది మన భవిష్యత్తుకు
అనంత శక్తినిస్తుంది.
నిన్ను నన్ను నిలబెడుతుంది.



- డా॥పోరెడ్డి రంగయ్య
సెల్: 9948049864

## ఓటు విలువ తెలుసుకో.!

ప్రజాస్వామ్యం వృక్షం
పచ్చగ ఉండాలంటే
ఓటు అనే వాటర్
పోయాలి ప్రతి ఓటర్

నేతల తలరాతల్ని
మార్చే విధాత ఓటర్
నాయకుల పదవీ కిరీటాన్ని
పడగొట్టే బాహుబలి ఓటర్

నోటుకు వేశావో ఓటు
ప్రజాస్వామ్యానికి చేటు
నోటుకు మురిసిపోకు ఓటర్
ఓటును అమ్ముకోకు ఓటర్

ఓటును అమ్ముకుంటే
నీకు ఒక్కరోజే సంతోషం
ఓటును కొనుకున్న వాడికి
ఐదు సంవత్సరాలు సంతోషం.

ఓటు ప్రజాస్వామ్యానికి
ప్రాణవాయువు ఓటర్
ఓటు విలువను గుర్తించు
ప్రజాస్వామ్యాన్ని రక్షించు





- బూర దేవానందం
8143589789.

## ఏలికలను ఎరకబట్టి ఎన్నుకోవాలె

ఏలికలను ఎన్నికలప్పుడు
ఎరకబట్టి ఎన్నుకోవాలె
ఏరు దాటిన తర్వాత
తెప్ప తగలేసే నేతలుంటారు.

సంక్షేమం పేరు చెప్పి చంకనెక్కుతరు
సరుకుల ధరలతో సదుగులిడుస్తరు

ప్రాంతం పేరుతో ఒకడు
పంతం పేరుతో ఒకడు
మతం పేరుతో ఒకడు
కులం పేరుతో ఒకడు
వర్గం పేరుతో ఒకడు
మందు బోసి మరొకడు
వర్గ పెట్టేది ఏమీ లేదు
ఓట్లను గంపగుత్తగా కుదబెట్టుడు తప్ప.

మందిస్తడు కానీ మాట ఇవ్వడు
ఇచ్చిన మాటకు విలువ ఇవ్వడు
మనసును మాయ చేసి
మందుల ముంచుతుంటారు.

పైసలు తీసుకొని పరేషాను కావొద్దు
మురిసి మురిసి మురికి పాలు కావొద్దు
గారడి మాటలకు గాయగాయి కావొద్దు
ఆదమసి అడవి పాలు కావొద్దు
అగువకు అమ్ముడై ఆగం కావొద్దు.

ఒక్క అడుగు ఆగి ఆలోచించు
నీ ఎన్నికతో భవిష్యత్తుకు భరోసాగావాలె.



-డా. ఎడ్ల కల్లేశ్
9866765126

## మళ్ళీ ఎన్నికలు వస్తున్నాయి...

అన్యాయం అక్రమం
అవినీతి అధర్మం
అన్నీ కలగలిసి
పెట్టుకున్నాయి పొత్తు
టోపీలతో కండువాలతో
ఎన్నికలలో నేతలు
ప్రలోభాలకు ప్రచారాలకు
సగటు ఓటరు చిత్తు
మద్యం ఏరులై పారి
ప్రజల మనసులోకి దూరి
నేతలు మాటలతో మత్తు
పార్టీల కండువాలు
మారిన వేగంతో
ప్రజల సమస్యలు
మార్చలేని తీర్చలేని
నేతలున్న దేశంలో
మళ్లీ ఎన్నికలు
వస్తున్నాయి!



-శ్రిష్టి శేషగిరి
9290652632



## ఓటు విలువ.

నోటు కు ఓటే వేస్తే,
కాదా
ప్రజాస్వామ్యానికి హాని!

నాటు కి ఓటే వేస్తే,
కాదా
ప్రజాస్వామ్యం ఖూనీ!

తాయిలాలకు
తలవంచకు నేస్తం!

నిజాయితీగా వేసే ఓటే
ప్రగతికి బాటవుతుంది!

నోటు కోసం ఆశ పడే
ఓటరు బతుకు దేనికని?

పేదల బతుకులు మార్చని,
వాగ్దానాలు దేనికని?

నీతికి నిలవని,
నిజాయితీ లేని
చిల్లర నేతలు దేనికని?

ఓటో, ఓటని
వట్టి మాటలే గాని.

ఓటు వేయ కదలని
సోమరి వాళ్లు దేనికని?!
( సినారె గజల్ ప్రేరణతో... )

-కమలేకర్ శ్యాం
ప్రసాద్ రావు
9441076632





## రాజకీయం

*అలిశెట్టి ప్రభాకం*

ఒక నక్క
ప్రమాణస్వీకారం చేసిందట
ఇంకెవర్నీ వంచించనని
ఒక పులి
పశ్చాత్తాపం ప్రకటించిందట
తోటి జంతువుల్ని
సంహరించినందుకు.

ఈ కట్టు కథ విని
గొర్రెలింకా
పుర్రెలూపుతూనే ఉన్నాయ్

కుంభ కోణం టోపీ
కొత్త బట్టతలపై
వాలినట్టు
అవినీతి పొట్టని
నల్లధనం బొడ్డు
మార్చినట్టు
థూ!
రాజకీయమంత
నీతి బాహ్యమైంది
మరొకటి లేదు.

## భవిష్యత్తును ఎన్నుకో.

గడిచిన కాలాన్ని నెమరువేసుకుంటు..
భవిష్యత్తుకు బంగారు దారిని వెతుకు.
మాయమాటల చాటున దాగిన మర్మాన్ని చూడు.
కులం.. మతం.. ప్రాంతం.. ప్రాతిపదికన...
ఓటుకు రేటు పెడుతున్న రాజకీయాన్ని గమనించు.
నోట్లకట్టలు చూసు నోరెళ్ళబెట్టకు.
సారా కంపుకు సంతోషపడకు.
పదో పరకకో ఆశపడి..
పిల్లల భవిష్యత్తును బుగ్గిపాలు చెయ్యకు.
వచ్చినఅవకాశం చేజారి పోయాక...
ధర్నాలు రాస్తారోకోలుచేసి దగాపడిపోకు.
నువ్వు నడుస్తున్న రోడ్డును చూడు.
నువ్వు ట్రీట్మెంట్ పొందుతున్న దవాఖానాను చూడు.
మీ పిల్లలు చదువుతున్న బడులను చూడు.
తలాపున పారుతున్న గోదారమ్మ కన్నీరును చూడు.
గిట్టుబాటుదక్కని రైతన్న గోసను చూడు.
నకిలీ విత్తనాలతో నలిగిపోతున్న సేద్యకాడిని చూడు.
ఉపాదిలేక ఉసూరుమంటున్న యువతను చూడు.
పైవన్నిటిని చూసి నువ్వోటెసె గుర్తును చూడు.
నీకు నచ్చినవాడికి...రేపు నిను మెచ్చె వాడికి
పట్టం కట్టు.
గరీబోన్ని బతకనిచ్చే నాయకుడికి దండంపెట్టు.
ఊరువాడను అద్దంలా తయారుచేసి..
అభివృద్ధిని చేసే నాయకున్ని ఆదరించు.
కష్టసుఖాల్లో కలిసినడిచే రాజకీయనాయకున్ని
ఆదరించు.
భవిష్యత్తును భద్రంగా ఎన్నుకో.
బాధ్యతగా ఓటును వినియోగించుకో.
ఆశల పల్లకిలో ఊరేగించి...
అందినకాడికి అందిపుచ్చుకుని..
ఇచ్చిన హామీలను మరిచిపోయే నాయకున్ని..
ఊరవుతలకు తరిమికొట్టు.

-అశోక్ గోనె.
9441317361.

